## క్లుప్తంగా

### వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల



**అల్లూరు:** స్థానిక ఆర్డీఆర్ కాలనీలో పోలేరమ్మ తిరునాళ్లను బుధవారం వైభవంగా నిర్వహించారు. పోలేరమ్మను విశేషంగా అలంకరించి ట్రాక్టర్‌పై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామోత్సవంలో కీలుగుర్రాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### స్వయం ఉపాధి సాధించాలి



**కావలి:** పట్టణంలోని ట్రాన్స్‌జెండర్లకు అబైడింగ్ హోప్ ట్రస్ట్, పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో కుట్టు మెషీన్లను బుధవారం పంపిణీ చేశారు. అబైడింగ్ హోప్ ట్రస్ట్ డైరెక్టర్ ఎం టైటస్ నిర్మల్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో అందరూ సమానమేనన్నారు. ట్రాన్స్‌జెండర్లకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో కుట్టు మెషీన్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కుట్టుమెషీన్లను సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జాషువా, మార్టిన్, డాక్టర్ విజయవాణి, జయప్రకాష్, దిలీప్‌కుమార్, వినయ్, రూతుబినో, తదితరుల పాల్గొన్నారు.

### సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

**అల్లూరు:** బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ల ద్వారా మంజూరు చేసే సబ్సిడీ రుణాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ ఉమామహేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఏపీఓబీఎంఎంఎస్ వెబ్ సైట్ లేదా వార్డు సచివాలయాల్లో ఈ నెల 7వ తేదీలోగా చేసుకోవాలని కోరారు. ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన, 17 నుంచి 20 వరకు లబ్ధిదారుల ఎంపిక, 21 నుంచి 23వ తేదీ వరకు కలెక్టర్ ద్వారా రుణాలను మంజూరు చేయడం జరుగుతుందని వివరించారు.

**ఉదయగిరి:** బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ అప్పాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఈ నెల 7వ తేదీలోగా ఓబీఎంఎస్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుని తమ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

### కుట్టు మెషీన్ల వితరణ



**కావలి:** పట్టణంలోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో ఈ నెల 8వ తేదీ నుంచి మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా తరగతులను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పలువురు కుట్టు మెషీన్లను బుధవారం వితరణ చేశారు. వెంగళరావునగర్‌కు చెందిన బీవీ రత్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎంవీఎస్ ప్రసాద్‌రావు రెండు, ఇందిరానగర్‌కు చెందిన వడ్డి వెంకటేష్ తన సతీమణి వడ్డి సంతోషమ్మ జ్ఞాపకార్థంగా ఒకటి చొప్పున కుట్టుమెషీన్లను అందజేశారు. కాగా సంయుక్త సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు ఐదు బ్యాచ్‌లకు ఉచిత కుట్టు శిక్షణ అందించినట్లు సంస్థ నిర్వాహకుడు సురేంద్ర తెలిపారు. అలాగే మగ్గం, బ్యూటీపార్లర్, కంప్యూటర్ శిక్షణలను దాతల సహకారంతో ఉచితంగా అందించినట్లు వివరించారు.

### పీహెచ్‌సీ వైద్యుడిపై విచారణ

**అనుమసముద్రంపేట:** ఏఎస్‌పేట పీహెచ్‌సీలో వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్న సురేష్‌బాబుపై స్టాఫ్‌నర్సు లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై జిల్లా వైద్యురాలు భృచిత బుధవారం విచారణ చేపట్టారు. ఇటీవల డాక్టర్ సురేష్‌బాబు విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నందుకు స్టాఫ్‌నర్సు లక్ష్మి డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డాక్టర్ భృచితను డీఎంహెచ్‌ఓ విచారణాధికారిగా నియమించారు. బుధవారం ఆమె వైద్యశాలకు చేరుకుని వైద్యులు మంజుల, సురేష్‌బాబుతో పాటు స్టాఫ్‌నర్సును విడివిడిగా విచారించారు. నివేదికను జిల్లా వైద్యాధికారులకు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు.

### పదిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

**వరికుంటపాడు:** పదోతరగతిలో నూరు శాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ 2 సీహెచ్ రమణయ్య సూచించారు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లె ఉన్నత పాఠశాలలో జరుగుతున్న వందరోజుల ప్రత్యేక బోధనా తరగతులను బుధవారం ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ప్రతి విద్యార్థి కష్ట పడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. తల్లిదండ్రులకు, పాఠశాలకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

# పడకేసిన పారిశుధ్యం

- పూడికతో నిండిన డ్రైనేజీలు
- వీధుల్లో ప్రవహిస్తున్న మురుగు
- స్వైర విహారం చేస్తున్న పందులు
- ఇబ్బందులు పడుతున్న దర్గాకు వచ్చే భక్తులు
- ఇదీ మంత్రి ఆనం ఇలాకాలోని ఏఎస్‌పేటలోని దుస్థితి





పూడికతో నిండిన డ్రైనేజీలు

**అనుమసముద్రంపేట:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఏఎస్‌పేటలో పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. వీధుల్లో చెత్త పేరుకుపోయి దర్శనమిస్తోంది. డ్రైనేజీలు పూడికతీతకు నోచుకోక మురుగు పొంగి వీధుల్లో ప్రవహిస్తోంది. పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో స్థానికులతో పాటు దర్గాకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీకి ప్రభుత్వం నుంచి వచ్చే నిధులే కాకుండా ప్రత్యేక నిధులు సైతం కేటాయిస్తుంటారు. అయినప్పటికీ పారిశుధ్యం ఏ మాత్రం మెరుగు పడడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**ఆర్భాటపు ప్రకటనలకే పరిమితం**

ఏఎస్‌పేటలోని దర్గాకు ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. దర్గాకు నలువైపులా రహదారులు ఉన్నాయి. డ్రైనేజీలు పూడిపోయి మురుగు రోడ్లపై ప్రవహిస్తూ దుర్గంధం వెదజల్లుతుండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. గత ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏఎస్‌పేట పుణ్యక్షేత్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని కూటమి నాయకులు ఆర్భాటపు ప్రకటనలు గుప్పించారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా అభివృద్ధి పనులు కాదు కదా కనీసం పారిశుధ్య పనులను కూడా పట్టించుకోకపోవడంపై ప్రజలు ఈసడించుకుంటున్నారు.

**12 మందే పారిశుధ్య కార్మికులు**

ఏఎస్‌పేట మేజర్ పంచాయతీ. దీని పరిధిలో మండల కేంద్రమైన అనుమసముద్రంపేటతో పాటు చందులూరుపాడు, గండువారిపల్లి గ్రామాలు ఉన్నాయి. ప్రముఖ పుణ్యక్షేత్రమైన దర్గా సైతం ఉంది. అయినా పంచాయతీలో 12 మంది మాత్రమే పారిశుధ్య కార్మికులు ఉన్నారు. దీంతో పంచాయతీ సిబ్బంది దర్గాకు భక్తులు అధికంగా వచ్చే శుక్రవారం నాడు తూతూ మంత్రంగా పారిశుధ్య పనులు చేపడుతున్నారు. పంచాయతీకి నిధులు సక్రమంగా అందకపోవడం వల్లే పంచాయతీ కార్మికుల సంఖ్యను పెంచలేకపోతున్నామని, ఈ కారణంగా పూర్తిస్థాయిలో పారిశుధ్యాన్ని మెరుగుపరచలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారు. కాగా పంచాయతీ కార్యదర్శిని నిధుల విషయమై ఆరాతీయగా పంచాయతీకి ఎంత నిధులు వస్తున్నాయో తనకే తెలియదని చెబుతుండడం విశేషం.

**పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఏఎస్‌పేట దర్గాను దర్శించుకునేందుకు నిత్యం దేశ నలుమూలల నుంచి భక్తులు వస్తూ ఉంటారు. పంచాయతీ పరిధిలో పారిశుధ్యం పూర్తిగా లోపించింది. డ్రైనేజీల్లో పూడికతీత చేపట్టకపోవడంతో మురుగు పొంగి రోడ్లపై ప్రవహిస్తోంది. దర్గా పరిసరాలు దుర్గంధం వెదజల్లుతుండడంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీలోని ప్రజలు కూడా నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీకి పారిశుధ్య కార్మికులను పెంచాలి.

– అస్లాం, సీపీఎం నాయకుడు

**పనులు చేపడుతున్నాం**

పంచాయతీ పరిధిలో పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపడుతున్నాం. పారిశుధ్య కార్మికులు 12 మంది మాత్రమే ఉన్నారు. మేజర్ పంచాయతీ కావడం, దర్గాకు భక్తులు ఎక్కువగా వస్తుండడంతో కార్మికులు సరిపోవడం లేదు.

–షరీఫ్, పంచాయతీ కార్యదర్శి, ఏఎస్‌పేట

### అటకెక్కిన రోడ్డు పనులు



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి దర్గా గేటు 1 వద్దకు చేరుకునే ప్రధాన రహదారి విస్తరణకు నిధులు మంజూరు చేయించారు. డ్రైనేజీలు సైతం తీయించారు. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టే క్రమంలో ఎన్నికలు రావడం..కొత్తగా కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో పనులు అటకెక్కాయి. ప్రస్తుతం కాలువల్లో చేరిన నీరు పొంగి రోడ్డు మీద ప్రవహిస్తోంది. దీనికితోడు మంచినీటి పైపులైన్లు సైతం పగిలి నీరు రోడ్డుపై ప్రవహిస్తూ బురదమయంగా మారుతోంది. దీంతో రాకపోకలు సాగించేందుకు భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా ఆ రోడ్డు నిర్మాణం గురించి పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డు నిర్మాణానికి మంజూరైన నిధులు ఏమయ్యాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు గ్రామంలోని పీహెచ్‌సీ, పాఠశాలలకు వెళ్లే రహదారి సైతం చిన్నపాటి వర్షం పడినా నడవలేని పరిస్థితులు నెలకొంటున్నాయి.



ఇళ్ల ముందు పారుతున్న మురుగు

### ఎల్‌ఐసీ ఉద్యోగుల నిరసన

**ఆత్మకూరు:** ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు ఆత్మకూరులోని ఎల్‌ఐసీ ఉద్యోగులు ఎఫ్‌డీఐలకు వ్యతిరేకంగా బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టీ రమేష్, శ్యాంప్రభాకర్ మాట్లాడుతూ ఎల్‌ఐసీలో ఎఫ్‌డీఐలు పెంచడం సరికాదని, దాని వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. ఎల్‌ఐసీలో ఎఫ్‌డీఐలను 74 శాతం నుంచి 100 శాతానికి పెంచడాన్ని వ్యతిరేకించారు. ఎల్‌ఐసీ ప్రీమియంలపై జీఎస్టీని రద్దు చేయాలని, ఏఐఐఈఏకి గుర్తింపు ఇవ్వాలని, 3, 4 తరగతి ఉద్యోగుల నియామకాలను వెంటనే జరపాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు సాయితేజ, నందగోపాల్, ఆఫీస్ సిబ్బంది, ఏజెంట్ మిత్రులు పాల్గొన్నారు.

### ఏరియా ఆస్పత్రిలో అందుబాటులో టెనెక్టేప్లెస్

**కావలి:** పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గుండెపోటుకు గురైన వారికి ప్రాణాలను కాపాడేందుకు మొదటి గంటలో వినియోగించే టెనెక్టేప్లెస్ ఇంజక్షన్‌ను అందుబాటులో ఉంచామని ఆ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి బుధవారం తెలిపారు. గుండెల్లో నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండె దడ, స్పృహ కోల్పోవడం, తదితర లక్షణాలు ఉంటే గుండెపోటుకు గురైనట్లుగా గుర్తించాలన్నారు. ఈ లక్షణాలు ఉన్న వారు మొదటి గంటలోనే 108కి ఫోన్ చేసి వెంటనే ఏరియా ఆస్పత్రి తీసుకొస్తే ప్రాథమిక పరీక్షలు నిర్వహించి మొదటి గంటలోనే రూ.45వేల విలువైన టెనెక్టేప్లెస్ ఇంజక్షన్‌ను ఉచితంగా అందించి ప్రాణాలను కాపాడుతామని తెలిపారు. మొదటి గంట అత్యంత కీలకమన్నారు. ఆ తరువాత శస్త్రచికిత్స చేయించుకుని ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. కావలి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## క్షేత్ర విజ్ఞానాన్ని పెంపొందించాలి

**కావలి:** పట్టణంలోని జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో డెయిరీ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'జాతీయ రంగంలో పాడి పరిశ్రమ–ఒక పరిశీలన' అనే అంశంపై సెమినార్‌ను బుధవారం నిర్వహించారు. డెయిరీ సైన్స్ విభాగం పూర్వ హెచ్‌ఓడీ డాక్టర్ ఆర్ మల్లికార్జునరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో పాడి పరిశ్రమ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని దినదినాభివృద్ధి చెందుతోందని తెలిపారు. డెయిరీ సైన్స్ విద్యార్థులను కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం చేయకుండా, డెయిరీలు, పాలశీతలీకరణ కేంద్రాలను ప్రత్యక్షంగా చూపించి క్షేత్ర విజ్ఞానాన్ని పెంపొందించాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ సుబ్రహ్మణ్యంనాయుడు, స్వయం ఉపాధి కోర్సుల సంచాలకులు డాక్టర్ ఆర్ మాల్యాద్రి, తదితరులు ప్రసంగించారు. అనంతరం మల్లికార్జునరెడ్డిని ఘనంగా సత్కరించారు. డెయిరీ సైన్స్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ డాక్టర్ జీ రమణారెడ్డి, అధ్యాపకులు డాక్టర్ జీ అమరావతి, ఏ దుశ్యాంక, సీహెచ్ ప్రత్యూష, తదితరులు పాల్గొన్నారు.



మల్లికార్జునరెడ్డిని సత్కరిస్తున్న అధ్యాపకులు

## శనగ పంటలో ఎండాకు తెగులు

**దుత్తలూరు:** మండలంలో సాగులో ఉన్న శనగ పంటలో ఆకు ఎండుతెగులు ఉన్నట్లు కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ డీ విజయకుమార్‌నాయక్ తెలిపారు. మండలంలోని లక్ష్మీపురంలో సాగులో ఉన్న శనగ, నువ్వు పంటలను పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన పరిశీలించారు. శనగలో ఆకు ఎండు తెగులును గుర్తించి నివారణకు ప్రొపికోనోజోల్ 200 మి.లీ లేదా హెక్సాకోనాజోల్ 400 మి.లీను ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు. అలాగే నువ్వు పంటలో ఆకుముడత నివారణకు ఇండాక్సికార్బ్ 25 లీటర్లు లేక అసిఫేట్ 300 మి.లీ లేదా కాంటాక్ట్ ప్లస్ 400 మి.లీను ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు. డీఆర్సీ నెల్లూరు ఏఓ గీతాకుమారి, మండల వ్యవసాయాధికారి ఎస్.వెంకటసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**ఎలుకల నివారణపై అవగాహన**

**సోమశిల/చేజర్ల:** అనంతసాగరంలోని సచివాలయం– 1, సంజీవనగరం గ్రామాల్లో వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ పాల్గొని రైతులకు సామూహిక ఎలుకల నివారణపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా ఉచితంగా బ్రోమోడయోలిన్ 0.25 శాతం ఎలుకల మందును పంపిణీ చేస్తోందని తెలిపారు. అలాగే చేజర్ల మండలం ఏటూరులో వ్యవసాయ అధికారి శశిధర్ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఎలుకల మందును వినియోగించే విధానాన్ని డెమో ద్వారా చూపించారు. ప్రతి ఈక్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు.

## భూఆక్రమణదారుడిపై చర్యలకు డిమాండ్

**సీతారామపురం:** దేవిశెట్టిపల్లి పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 86–3లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించిన మారంరెడ్డిపల్లి ఎస్సీ కాలనీ వాసిపై అధికారులు చర్యలు చేపట్టాలని దేవిశెట్టిపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. ఆక్రమణదారుడి కుటుంబ సభ్యులు సైతం దేవిశెట్టిపల్లిలోని అనేక సర్వేనంబర్లకు నకిలీ పట్టాలను సృష్టించి గ్రామస్తులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై మండల తహసీల్దార్‌కు ఎన్నిసార్లు విన్నవించినా ప్రయోజనం లేకపోవడంతో ఆత్మకూరు ఆర్డీఓ, కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశామని తెలిపారు. వారు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు చేపట్టాలని ఆదేశించినా మండల రెవెన్యూ అధికారులు బేఖాతరు చేస్తూ భూఆక్రమణదారుడికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి భూఆక్రమణదారులపై చర్యలు తీసుకోకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహసీల్దార్ రెండుమూడ్రోజుల్లో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు.

## పాఠశాలల విలీన ప్రక్రియపై తల్లిదండ్రుల ఆందోళన



ఉర్దూ పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

**ఆత్మకూరు:** ప్రభుత్వ పాఠశాలల విలీన ప్రక్రియను వ్యతిరేకిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం ఆందోళన చేపట్టారు. పట్టణంలోని 17వ వార్డులోని ఉర్దూ పాఠశాలను సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో విలీనం చేయడాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు వ్యతిరేకిస్తూ ఉర్దూ పాఠశాల ఎదుట నిరసన తెలిపారు. అలాగే జంగాలపల్లి పాఠశాలలోని 3,4,5 తరగతులను సమీపంలోని అశ్వనీపురం పాఠశాలలో విలీనం చేసే ప్రక్రియను నిలిపివేయాలని కోరుతూ గ్రామస్తులు ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావనికి వినతి పత్రం అందజేశారు. సుమారు 30 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతారని విన్నవించారు. స్పందించిన ఆర్డీఓ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం మేరకు విలీన ప్రక్రియ సాగుతుందన్నారు. రెండు కిలోమీటర్ల కంటే దూరం ఉంటే ఒక్కో విద్యార్థికి రవాణా ఖర్చులు నెలకు రూ.600 చొప్పున పది నెలలకు రూ.6వేలు ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసుకుంటే సమస్య పరిష్కారమవుతుందని, ఆ దిశగా తల్లిదండ్రులు ఆలోచన చేయాలన్నారు. అయినా కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

### కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తాం

**సంగం:** కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి తెలిపారు. మండలంలోని దువ్వూరులోని రైతు సేవా కేంద్రంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ధాన్యానికి గిట్టుబాటు ధరలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధరలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఏడీఏ నర్సోజి, మండల వ్యవసాయాధికారి శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

### పన్నులను నూరుశాతం వసూలు చేయాలి

**ఉదయగిరి:** మండలంలోని పంచాయతీల్లో ఇంటి, కుళాయి, తదితర పన్నులను మార్చి నాటికి నూరుశాతం వసూలు చేయాలని ఆత్మకూరు డీఎల్‌పీవో దాసరి నారాయణరావు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని పంచాయతీల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 15లోగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు.

### సర్వేను పారదర్శకంగా చేపట్టాలి

**సీతారామపురం:** సీతారామపురం పంచాయతీలో పీ–4 సర్వేను పారదర్శకంగా చేపట్టాలని డీవైఎస్‌ఓ సురేష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సీతారామపురం బీట్–1,2 సచివాలయాల సిబ్బందితో సర్వేపై బుధవారం ఆయన సమీక్షించారు. జిల్లాలో సీతారామపురం పంచాయతీని పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసినందున దారిద్ర్యరేఖకు దిగువనున్న వారిని పక్కాగా గుర్తించాలన్నారు. 9వ తేదీలోగా సర్వేను పూర్తిచేయాలన్నారు. ఎంపీడీఓ భాస్కర్, ఏఎస్‌ఓ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మంచినీటి పథకాన్ని పునరుద్ధరించాలి

**ఆత్మకూరురూరల్:** అప్పారావుపాళెంలోని సీపీడబ్ల్యూఎస్ పథకాన్ని జెడ్పీ సీఈఓ విద్యారమ బుధవారం పరిశీలించారు. పథకానికి మరమ్మతులు చేపట్టి 14 గ్రామాలకు తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆత్మకూరులో ఈ నెల 9న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్న పంచాయతీరాజ్ అతిథిగృహానికి స్థలాన్ని పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, డీఆర్‌డీఓ రమణయ్య, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మోహన్‌రావు, ఏఈ సుదర్శన్, ఈఓపీఆర్డీ డేవిడ్, ఏఓ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో అధికారులతో సమీక్షిస్తున్న జెడ్పీ సీఈఓ విద్యారమ

**సీపీడబ్ల్యూఎస్ స్కీం పరిశీలన**

**అనుమసముద్రంపేట:** కొండమీదకొండూరులోని సీపీడబ్ల్యూఎస్ స్కీంను జెడ్పీ సీఈఓ విద్యారమ బుధవారం పరిశీలించారు. 13 గ్రామాలకు మంచినీటిని సరఫరా చేస్తున్న సీపీడబ్ల్యూఎస్ స్కీం పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం జిల్లాలోని సీపీడబ్ల్యూఎస్ స్కీంలపై పనితీరుపై నివేదిక అందజేయాలని కోరడంతో పరిశీలన చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

## వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

**ఉదయగిరి:** ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామక ఉత్తర్వులను కేంద్ర పార్టీ కార్యాలయం బుధవారం జారీ చేసింది. 27 విభాగాలకు సంబంధించి అధ్యక్షుల నియామకం జరిగింది. యూత్ విభాగానికి గణపం రమేష్‌రెడ్డి, మహిళా విభాగానికి కోట నాగమణి, రైతు విభాగానికి అక్కెం హజరత్‌రెడ్డి, బీసీ సెల్‌కు మానం మస్తానయ్య, ఎస్సీ సెల్‌కు ఒంగోలు రాఘువేంద్ర, ఎస్టీ సెల్‌కు బత్తుల నారాయణమ్మ, మైనార్టీ సెల్‌కు ఎస్‌కే మర్జుజా, క్రిస్టియన్ సెల్‌కు లక్కినేని అశోక్‌కుమార్, విద్యార్థి విభాగానికి కే తేజారెడ్డి, పంచాయతీరాజ్ విభాగానికి మల్లు రియాజ్‌రెడ్డి, మున్సిపల్ విభాగానికి చెరుకూరి రసూల్, ఆర్టీఐకు సుద్దాల శ్రీనివాసులు, వలంటీర్స్ విభాగానికి కే రామిరెడ్డి, గ్రీవెన్స్ సెల్‌కు వాకా మాధవరెడ్డి, వాణిజ్య విభాగానికి నంబూరి రోశిరెడ్డి, వీవర్స్ విభాగానికి గువ్వల వెంకటేశ్వర్లు, మేధావుల ఫోరానికి తుమ్మల వెంగయ్య చౌదరి, వైఎస్సార్ టీయూసీకి ఉండేల దశరథరామిరెడ్డి, అంగన్‌వాడీ వింగ్‌కు మీరం మాల్యాద్రి, లీగల్ సెల్‌కు పీజే షరీఫ్, సాంస్కృతిక విభాగానికి గానుగుపెంట వెంకటప్రసాద్, సోషల్ మీడియాకు షేక్ ఖాజామస్తాన్, ఐటీ వింగ్‌కు వీరబోయిన సుధీర్‌కుమార్, పబ్లిసిటీ వింగ్‌కు వీ మల్లికార్జునరెడ్డి, డాక్టర్స్ వింగ్‌కు నీలం చౌదయ్య, బూత్ కమిటీ వింగ్‌కు యర్రగూటి చెంచురెడ్డి, దివ్యాంగుల విభాగానికి తుల్లిబిల్లి తిరుపతయ్యను నియమించారు.

## సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి

సాక్షి ఎఫెక్ట్..

**సీతారామపురం:** పంచాయతీల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఆత్మకూరు డీఎల్‌పీఓ ఆదినారాయణ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ నెల 3న 'సాక్షి'లో 'అధికారుల నిర్లక్ష్యం–పంచాయతీలకు శాపం' అనే శీర్షికన కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన డీఎల్‌పీఓ సీతారామపురం మండలంలో పర్యటించి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. వర్మికంపోస్టును తయారు చేసి రైతులకు విక్రయించి పంచాయతీల ఆదాయాన్ని పెంపొందించాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్‌అంబాసిడర్లతో సమీక్షించి పంచాయతీల అభివృద్ధిపై సమగ్ర అవగాహన కల్పించారు. పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ భార్గవి, పంచాయతీ కార్యదర్శులు, సీతారామపురం సర్పంచ్ భాగ్యకుమారి, గ్రీన్ అంబాసిడర్లు ఉన్నారు.



సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

## రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

**ఉదయగిరి:** ఆటోవాలాలు రోడ్డు భద్రత నియమాలను విధిగా పాటించాలని ఎస్సై–2 ఏ శ్రీనివాసులు సూచించారు. రోడ్డుభద్రత మాసోత్సవాల సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆటోవాలాలకు బుధవారం ఆయన అవగాహన కల్పించారు. తాము సూచించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే ఆటోలు నిలిపి క్రమపద్ధతిలో వెళ్లాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. యూనిఫామ్ ధరించాలని, ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, అధిక వేగంతో నడపరాదన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు.

**సంగం:** ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని సంగం సీఐ వేమారెడ్డి సూచించారు. మండలంలోని సిద్ధీపురం వద్ద బుధవారం ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేని ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు.



ఉదయగిరి: ఆటోవాలాలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనివాసులు